ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

హత్నూర, మార్చి 28 : హత్నూర మండలం దౌల్తాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లిం ప్రజలతో కలిసి సహపంక్తిభోజనం చేశారు. మెదక్‌జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి, తహసీల్దార్ ఫర్హీన్‌షేక్, రాష్ట్ర లేబర్‌వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నర్సింహులు, పలుపార్టీల నాయకులు హకీం, అజ్మత్ అలీ, ఇబ్రహీం, రఫీక్, బాబా, ఆబేద్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రాపురంలో..

రామచంద్రాపురం, మార్చి28 : రంజాన్ పండుగను ముస్లింలు సంతోషంగా జరుపుకోవాలని మాజీ కార్పొరేటర్ అంజయ్య, కాల్వగడ్డరాజ్ కుమార్ అన్నారు. శుక్రవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల గ్రామంలో ఆర్‌కే ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు కాల్వగడ్డ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ముస్లింలకు రంజాన్‌తోఫా, ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఆర్‌కే ఫౌండేషన్ సభ్యులు, బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

ముస్లింలకు రంజాన్ తోఫా అందజేస్తున్న బీఆర్ఎస్ నేత కాల్వగడ్డ రాజ్ కుమార్

నాటక ప్రదర్శన జయప్రదం చేయాలి

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సదాశివపేట, మార్చి 28 : పట్టణంలో ఏప్రిల్ 2న నిర్వహించే భారత రాజ్యంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీవిత నాటక ప్రదర్శనను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే నివాసంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీవిత చరిత్ర నాటక ప్రదర్శనకు సంబంధించిన (సంఘం శరణం గచ్చామి) కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబేద్కర్‌పై రూపొందించిన నాటక ప్రదర్శనను వీక్షించాలని ప్రజలకు సూచించారు. అనంతరం సామాజిక ఉద్యమ నాయకుడు అనంతయ్య మాట్లాడుతూ అంబేద్కర్ తన జీవితంలో ఎదుర్కొన్న సమస్యలు, ఇబ్బందులు, ఆయన చేసిన పోరాటాలను అభ్యుదయ ఆర్ట్ అకాడమీ హైదరాబాద్ వారు నాటకంలో ప్రదర్శించారన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం పట్టణ అధ్యక్షుడు గొంగ్లూరు ప్రభు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అశోక్, సీనియర్ న్యాయవాది దర్శన్, దళిత నాయకుడు లక్ష్మయ్య, బాలరాజ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెద్దగొల్ల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు అందజేత

కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న జోగిపేట ఏఎంసీ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి

చౌటకూర్, మార్చి 28 : మండలంలోని వివిధ గ్రామాల్లోని లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకం కింద మంజూరైన చెక్కులను శుక్రవారం అందజేశారు. తహసీల్ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జోగిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యతిథిగా హాజరై కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నత్తి దశరత్‌తో కలిసి చెక్కులను అందజేశారు. మండలంలోని 21 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికీ రూ. లక్షా 116 చొప్పున రూ.లక్షా 21,02 ,436 చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మన్నె కిరణ్ కుమార్, ఆర్ఐ రాజు, నాయకులు కలాలి ఈశ్వర్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, పార్కుల రాంరెడ్డి, రామాగౌడ్, క్లైసర్, మల్లారెడ్డి, రాములు, శ్రీహరి, ప్రభాకర్‌రెడ్డి, శివకుమార్, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డును రద్దుచేయాలి

52వ రోజుకు చేరిన రిలేదీక్ష

నల్లవల్లిలో రిలేనిరాహారదీక్షలు చేస్తున్న మహిళారైతు జేఏసీ నాయకులు

గుమ్మడిదల, మార్చి 28 : ప్యారానగర్ డంపింగ్‌యార్డు (ఎంఎస్‌డబ్ల్యూ)కు వ్యతిరేకంగా 52 రోజులుగా రిలేనిరాహారదీక్షలు చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించక పోవడం ప్రజలకు తీవ్రమనోవేదనకు గురిచేస్తోందని జేఏసీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రంలో రైతులు డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. నల్లవల్లి, కొత్తపల్లి, ప్యారానగర్ గ్రామాల్లో జేఏసీ నాయకులు 52వ రోజు రిలే నిరాహారదీక్షలను చేపట్టారు. ఈసందర్భంగా జేఏసీ నాయకులు గోర్ధన్‌రెడ్డి, ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ డంపింగ్‌యార్డుకు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మాజీ సర్పంచ్ చిమ్ముల నర్సింహారెడ్డి, జేఏసీ నాయకులు సురభి నాగేందర్‌గౌడ్, కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, గోపాల్, గటాటి రవి, మోహన్‌రెడ్డి, బాల్‌రెడ్డి, కావలి శంకర్‌యాదవ్, సూర్యనారాయణ, ఆంజనేయులు, కొరివి సురేశ్, మన్నె రామకృష్ణ, కొత్తపల్లి మల్లేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

నత్తనడకన వసతి గృహం పనులు

అసంపూర్తిగా ఉన్న సెప్టిక్ ట్యాంక్ పనులు

పుల్కల్, మార్చి 28 : మండల కేంద్రమైన పుల్కల్ ఎస్సీ బాలుర వసతి గృహంలో కొన్ని నెలలుగా కొనసాగుతున్న పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఎస్‌డీఎఫ్ కింద రూ. 10. 78 లక్షలు మంజూరయ్యాయి. ఆ నిధులు వసతి గృహంలో చోటు చేసుకున్న మరమ్మతుల కోసం వాటిని మంజూరు చేశారు. కానీ నెలలు గడుస్తున్న కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఎక్కడ పనులు అక్కడే నిలిచి పోయాయి. వసతి గృహంలో ప్రారంభించిన పనులు సెప్టిక్ ట్యాంక్, ప్రహరీ, విద్యుత్ సౌకర్యం తదితర పనులను సకాలంలో పూర్తి చేయక పోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి త్వరగా పనులు పూర్తయ్యేలా చూడాలని విద్యార్థులు వాపోతున్నారు.

బోరంచ ఆలయ హుండీ లెక్కింపు

మనూరు, మార్చి 28 : బోరంచ నల్ల పోచమ్మ ఆలయ హుండీ లెక్కింపు నిర్వహించినట్లు ఈవో శివరుద్రప్ప తెలిపారు. మనూరు మండల పరిధిలోని బోరంచ నల్ల పోచ మ్మ అమ్మవారి ఆలయ జాతర ఉత్సవాలు త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో హుండీ లెక్కింపు నిర్వహించినట్లు తెలిపారు. శుక్రవారం నిర్వహించిన హుండీ లెక్కింపులో రూ.6,17,878 వచ్చినట్లు తెలిపారు. ఆలయ హుండీ ఆదాయాన్ని ఆలయం పేరుపై ఉన్న ఖాతాలో జమచేయనున్నట్లు తెలిపారు. దేవాదాయశాఖ సూపరింటెండెంట్ శివరాజ్, ఎస్సై శంకరయ్య, ఆలయ పూజరులు నగేశ్ స్వామి, సిద్ధయ్య స్వామి, సిబ్బంది, శ్రీకాంత్‌రెడ్డి, శేఖర్ పాల్గొన్నారు.

చివరి దశకు నిమ్జ్ ప్రత్యేక రోడ్డు పనులు

- చకచకా భద్రత చర్యల ఏర్పాటు పనులు
- బీఆర్ఎస్ పాలనలోనే మౌలిక సదుపాయాలకు ప్రత్యేక చర్యలు
- నిమ్జ్ ప్రత్యేక రోడ్డు ప్రారంభించేందుకు సన్నాహాలు

జహీరాబాద్, మార్చి 28 : బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో నిమ్జ్ ప్రాజెక్టులో ఏర్పాటు చేయనున్న ఆయా పరిశ్రమల కోసం అన్ని మౌలిక సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకున్నది. నిమ్జ్ ప్రాంతానికి వచ్చే పరిశ్రమిక వేత్తలు, యాజమానులు సరైన రహదారి లేకపోవడతంలో ఇబ్బందులు పడుతుండడంతో ప్రత్యేక చర్యలు తీసుకుంది. జహీరాబాద్ నియోజకవర్గంలోని న్యాల్‌కల్, ఝరాసంగం ఆయా మండలాల పరిధిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ పెట్టుబడుల ఉత్పాదక మండలి(నిమ్జ్)లో పరిశ్రమల ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఆయా మండలాల్లోని 17 గ్రామాల్లో 12 ,635 ఎకరాల భూసేకరణ చేపట్టి, అందులో 2.50 లక్షల మందికి ప్రత్యేకంగా 5 లక్షల మందికి పరోక్షంగా ఉపాధి కల్పించాలనే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే మొదటి విడతతో ఆయా మండలాల్లో భూ సేకరణ పూర్తికాగా, రెండో విడతతో భూ సేకరణ కొనసాగుతుంది. సంబంధిత అధికారులు ఆయా మండలాల పరిధిలోని 6వేల ఎకరాలకు పైగానే భూసేకరణ పూర్తి చేశారు. 2023లో బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో మౌలిక సదుపాయాలను ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. ఈ నిమ్జ్ ప్రాంతాన్ని, జాతీయ రహదారి 65కు అనుసంధానం చేస్తూ జహీరాబాద్ మండలంలోని హుగ్గెల్లి నుంచి ఝరాసంగం మండలంలోని బర్దీపూర్ వరకు రూ. వంద కోట్లతో 9.5 కిలో మీటర్ల దూరం చేపట్టే రహదారి నిర్మించేందుకు చర్యలు తీసుకున్నది. ఆయా గ్రామాల మీదుగా రహదారి నిర్మాణానికి 65 ఎకరాల భూమి రైతుల నుంచి సేకరించి వారికి నష్టపరిహారం కింద రూ. 7.50 కోట్లు చెల్లించింది. జహీరాబాద్, ఝరాసంగం ఆయా మండలాల పరిధిలోని గ్రామాల్లో వంద అడుగుల వెడల్పుతో నిర్మించిన రెండు వరుసల రహదారిపైన 13 చోట్ల వంతెనలను నిర్మించారు. ఆయా గ్రామాల మధ్య నిర్మించిన రహదారికి మధ్యలో సుమారుగా 420 విద్యుత్ దీపాల స్తంభాలను ఏర్పాటు చేశారు. విద్యుత్ దీపాల కోసం 131కేవీ ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఇప్పటికే విద్యుత్ దీపాలను అమర్చి ట్రయల్ రన్ కూడా నిర్వహించారు. రోడ్డు నిర్మాణంలో భాగంగా ప్రజల భద్రతకు సంబంధిత శాఖాధికారులు వివిధ రకాల పనులను ముమ్మరంగా చేపడుతున్నారు. ఇప్పటికే రోడ్డు గుర్తుల కోసం వైట్, ఎల్లో లైన్స్, పాదచారుల కోసం క్రాసింగ్ జీబ్రా, వేగ పరిమిత, మలుపు గుర్తులను ఏర్పాటు చేశారు. రోడ్డు మధ్యలో డివైడర్లు, కంచెలు, సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. వ్యవసాయ పొలాలకు వెళ్లే రైతుల కోసం ఇరువైపులా వంద మీటర్ల రోడ్డును ఏర్పాటు చేశారు. ఝరాసంగం మండలంలోని మచ్నూర్, బర్దీపూర్, కృష్ణాపూర్ క్రాస్ రోడ్డు వద్ద నాలుగు వైపుల సూచిక బోర్డులను ఏర్పాటు చేసి ఇరువైపులా డివైడర్లను ఏర్పాటు చేశారు. జాతీయ రహదారికి అనుసందానంగా ఉన్న హుగ్గేలి గ్రామ సమీపంలో క్రాసింగ్ పనులు చకచక కొనసాగుతున్నాయి. మొత్తానికి నిమ్జ్ ప్రాజెక్టు ప్రత్యేక రోడ్డు మార్గం పనులు చివరి దశలో కొనసాగుతున్నాయి. ఇప్పటికే నిమ్జ్ ప్రాజెక్టులో పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు పారిశ్రామిక వేత్తలు, యాజమానులు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నారు. త్వరలోనే ఈ రోడ్డు మార్గాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. దీంతో నిమ్జ్ ప్రాజెక్టులో మరింత మంది పారిశ్రామిక వేత్తలు పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు అసక్తి చూపే అవకాశం ఉందని సంబంధిత అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రైతులను ప్రోత్సహించాలి

జిల్లా డ్వామా అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ బాల్‌రాజ్

సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ బాల్‌రాజ్

జహీరాబాద్, మార్చి 28 : ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల పెంపకానికి అవకాశం ఉన్న రైతులను ప్రోత్సహించాలని జిల్లా డ్వామా అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ బాల్‌రాజ్ అన్నారు. శుక్రవారం న్యాల్‌కల్ మండలంలోని అత్మూర్, న్యాల్‌కల్ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద మామిడి తోటల పెంపకం, పాడిగేదెలా షెడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం మండల కేంద్రమైన న్యాల్‌కల్ ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ పథకం అధికారులు, సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాల్లోని పంచాయతీల్లోని నర్సరీలో పెంచుతున్న మొక్కలు ఎండిపోకుండా గ్రీన్ షెడ్లను ఏర్పాటు చేసి, ప్రతి రోజు మొక్కలను నీరు పోసి సంరక్షించాలన్నారు. ఈ సమావేశంలో ప్లాంటేషన్ మేనేజర్ మణి కుమార్, ఏపీవో రంగారావు, ఈజీఎస్ ఈసీ, టీఏలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధం అందరి బాధ్యత

ప్లాస్టిక్ కవర్ వాడొద్దంటూ షాపులో స్టిక్కర్ అతికిస్తున్న మున్సిపల్ కార్మికుడు

జిన్నారం, మార్చి 28 : ప్లాస్టిక్ నిషేధం అందరి బాధ్యత అని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్ అన్నారు. బొల్లారం మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం మున్సిపాలిటీలో పలు వ్యాపార సంస్థల సముదాయాల ముందు ప్లాస్టిక్ కవర్లు వినియోగించవద్దంటూ స్టిక్కర్లను అతికించారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్ల వినియోగంలో ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను ప్రజలు పాటించాలన్నారు. ప్లాస్టిక్ కవర్ల వాడకంతో కలిగే అనర్థాలపై వ్యాపార సంస్థల యజమానులకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించండి కుందాం – ప్రకృతిని రక్షించుకుందామని పిలుపునిచ్చారు.

గుమ్మడిదలలో 12 లక్షల పార్థివలింగాల ఊరేగింపు

కృష్ణానంద ఆశ్రమంలో పార్థివలింగాలకు ప్రత్యేక పూజలు చేస్తున్న వేదపండితులు

గుమ్మడిదల, మార్చి 28 : మున్సిపాలిటీ కేంద్రంలోని రాంనగర్ కాలనీలోని కృష్ణానంద ఆశ్రమంలో శుక్రవా రం మాధవానంద సరస్వతీ సేవాబృందం 12 లక్షల పార్థివ లింగాలు, శివపుష్టి ఊరేగింపు చేశారు. సమర్పణలో భా గంగా రాంపూర్‌క్షేత్రపీఠాధిపతి గురు మాధవానందసరస్వతీ పర్యవేక్షణలో భక్తులు భక్తిశ్రద్ధలతో ఊరేగింపు నిర్వహించారు. కృష్ణానంద ఆశ్రమంలో ఆదేశాను సారం భక్తులు 12 లక్షల పార్థివలింగాలను, శివపుష్టి (బియ్యం, నువ్వు లు, శనగలు, మినుములు, గోధుమలు ధా న్యాల) సమర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి గురుమాధవానందసరస్వతీ ప ర్యవేక్షణలో వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కల్యాణరామచంద్రస్వామి ఆలయ సమీపంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వరకు భక్తులు పార్థివలింగాలను ఊరేగింపు చేపట్టారు. ఆంజనేయస్వామి ఆలయంలో వాటికి ప్రత్యేక పూజలు, హనుమాన్‌చాలీసా పారాయణం చేశారు. అనంతరం బీరంగూడలోని కాకతీయనగర్‌లో నూతనంగా నిర్మించిన పంచముఖలింగేశ్వరస్వామి విగ్రహప్రతిష్టకు తరలించారు. ఆశ్రమంలో రుద్రాభిషేకాలు చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

కోహీర్, మార్చి 28 : మండలంలోని కొత్తూర్(డి) గ్రామ శివారులో బైక్‌ను డీసీఎం ఢీకొన్న సంఘటనలో ఇద్దరు మృత్యువాత పడ్డారు. ఎస్సై సతీశ్‌వర్మ కథనం ప్రకారం... కొత్తూర్(డి) గ్రామ శివారులోని 65వ జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం గ్లోబల్ గ్రీన్ పరిశ్రమ నుంచి రాంగ్ రూట్‌లో సదాశివపేట వైపునకు వెళ్తున్న డీసీఎం డ్రైవర్ తప్పిదంతో ఇద్దరు మృతి చెందారు. కొత్తూర్(డి) వద్దకు రాగానే జహీరాబాద్‌లోని రాంనగర్‌కు వెళ్లే బైక్‌ను ఢీకొన్నది. దీంతో బైక్‌పై ఉన్న ఉమేశ్ (50)కు తీవ్రగాయాలు కావడంతో సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. అదే బైక్‌పై ఉన్న శరణమ్మ ఆమె కుమారుడు సిద్ధుకు తీవ్రగాయాలయ్యాయి. రాంగ్ రూట్‌లో వెళ్తూనే అదే డీసీఎం మరో బైక్‌పై ఉన్న మక్తలూర్‌కు చెందిన మంగలి శ్రీశైలం (46)ను కూడా ఢీకొన్నది. అతడికి కూడా తీవ్ర గాయాలు కావడంతో సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. మృతి చెందిన ఇద్దరితో పాటు మరో ఇద్దరిని జహీరాబాద్ దవాఖానకు తరలించారు. డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి సంఘటన సందర్శించి వివరాలను సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కల్వర్టు ఢీకొని ఒకరి మృతి

మరొకరికి తీవ్రగాయాలు

చౌటకూర్, మార్చి 28 : మండల కేంద్రం చౌటకూర్ సమీపంలో సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161 జాతీయ రహదారి కల్వర్టును ఢీకొని ఒకరు మృతి చెందగా, మరో మహిళకు తీవ్రగాయాలైన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామానికి చెందిన చాకలి నర్సింహులు (55), భార్య జ్యోతి (50) టీవీఎస్‌లూనాపై జోగిపేట వెళ్తున్నారు. ఈ క్రమంలో లూనా అదుపు తప్పి జాతీయ రహదారి కల్వర్టును వేగంగా ఢీకొట్టింది. ఈ సంఘటనలో చాకలి నర్సింహులు అక్కడిక్కడే మృతి చెందగా, భార్య జ్యోతి తలకు బలమైన గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన జ్యోతినిచికిత్స నిమిత్తం 108 అంబులెన్స్ వాహనంలో సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానాకు తరలించారు. జ్యోతి పరిస్థితి విషమంగా ఉండటంతో ఆమెకు మెరుగైన వైద్యం కోసం గాంధీ దవాఖానకు తరలించారు. ఈ మేరకు పుల్కల్ ఎస్సై పాటిల్ క్రాంతి కుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

మునిపల్లి, మార్చి 28 : అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని బోటిశెట్‌పల్లిలో గురువారం చోటు చేసుకుంది. మునిపల్లి ఎస్సై రాజేశ్ నాయక్ కథనం ప్రకారం.. మునిపల్లి మండలంలోని బొడ్‌శెట్‌పల్లి గ్రామానికి చెందిన గొల్లపల్లి రాజు(45) అప్పుల బాధతో మనస్తాపం చెంది ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లింల నిరసన

కోహీర్‌లో నిరసన తెలుపుతున్న ముస్లింలు

ఝరాసంగం, మార్చి 28 : పార్లమెంటులో ప్రవేశ పెట్టిన వక్ఫ్ బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా శుక్రవారం నమాజ్ ముగిసిన అనంతరం మండల కేంద్రంలోని మసీద్ వద్ద 35 మంది ముస్లింలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు.

కోహీర్‌లో..

కోహీర్, మార్చి 28 : పార్లమెంట్‌లో బిల్లును ఆమోదించ వద్దని స్థానిక ముస్లింలు శుక్రవారం కోహీర్ పట్టణంలోని మసీద్ ఆవరణలో నల్ల రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

హత్నూరలో..

హత్నూర, మార్చి28 : మండలకేంద్రమైన హత్నూరలో శుక్రవారం ముస్లింలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ముస్లిం మతపెద్దలు నవాబ్, ముఖ్తీబారి, ఇంతియాజ్, షారుల్లా, ఆలీమ్, ఇర్ఫాన్, రఫీ, ఆసిఫ్, అఫ్జల్, ఇస్మాయిల్, జహీర్, జావేద్, పాషా తదితరులు పాల్గొన్నారు.

పగిలిన పైప్‌లైన్.. వృథాగా తాగునీరు

పట్టించుకోని అధికారులు

పైప్‌లైన్ పగిలి వృథాగా పోతున్న తాగునీరు

చౌటకూర్, మార్చి 28 : మండలంలోని వెండికోల్‌లో మంజీర జలాలను సరఫరా చేస్తున్న పైప్‌లైన్ పలిగిలిపోయింది. మిషన్ భగీరథ పథకం కింద హున్నాపూర్‌లోని నీటి శుద్ధి కేంద్రం నుంచి వెంకటకిష్టాపూర్, వెండికోల్, లింగంపల్లి గ్రామాలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. వెంకటకిష్టాపూర్ నుంచి వెండికోల్ గ్రామానికి రక్షిత మంచినీటి ట్యాంకులోకి తాగునీటిని ఎక్కించేందుకు ప్రత్యేక పైప్‌లైన్‌ను ఏర్పాటు చేశారు. గురువారం రాత్రి పైప్‌లైన్ పగిలిపోవడంతో మంచినీటి ట్యాంకులోకి నీరు చేరలేదు. పైప్‌లైన్ పగిలిపోయి మంజీర జలాలు వృథాగా పోయాయి. ఉదయం గమనించిన స్థానికులు లైన్‌మెన్‌కు సమాచారం అందించారు. రాత్రి నుంచి ట్యాంకులోకి తాగునీరు చేరకపోవడంతో ఉదయం నీటి సరఫరా లేక ప్రజలు అవస్థలు పడ్డారు. ఈ ట్యాంకు నింపిన తర్వాతనే నీటిని గ్రామానికి సరఫరా చేస్తున్నారు. పైప్‌లైన్ పగిలిపోవడం, ప్రత్యామ్నాయం లేకపోవడంతో శుక్రవారం ప్రజలు తాగునీటి కోసం సమీప బోరుబావులను ఆశ్రయించాల్సి వచ్చింది. ఎండలు మండిపోతున్న ప్రస్తుత తరుణంలో తాగునీటి సరఫరాలో ఎలాంటి అవంతరాలు లేకుండా చూడాల్సిన సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పగిలిన పైప్‌లైన్‌ను వెంటనే మరమ్మతులు చేపట్టి తాగునీటిని పునరుద్ధరించాలని కోరుతున్నారు.

ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శీతాకాల శిబిరాలు ప్రారంభం

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 28 : ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శీతాకాల శిబిరాలు శుక్రవారం నుంచి ఏప్రిల్ 3 తేదీ వరకు వారం రోజుల పాటు మండల పరిధిలోని కలబ్‌గూర్ చింతలపల్లి, అంగడిపేట గ్రామాల్లో నిర్వహించనున్నట్లు స్థానిక తారా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ అన్నారు. శుక్రవారం సెమినార్ హాలులో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శీతాకాల శిబిరాలు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ నిర్వహణ కమిటీ సభ్యుడు ప్రభంజన్, పెంచన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ తల్లికి బోనాలు

ఇందూర్‌లో బోనాల ఊరేగింపు

రాయికోడ్, మార్చి 28 : మండల పరిధిలోని ఇందూర్‌లో శుక్రవారం ఘనంగా పోచమ్మతల్లికి బోనాలు తీశారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల నృత్యాలతో ఆకట్టుకున్నాయి. ఈ సమావేశంలో ఇందూర్ పీఏసీఎస్ చైర్మన్ హనుమంతు, గ్రామ పెద్దలు నర్సింహులు, మహంకాళి, మణిక్యం, మల్లేశం, మొగులయ్య, ప్రసాద్ ఉన్నారు.

పనులను నాణ్యతగా చేపట్టాలి

రాయికోడ్, మార్చి 28 : గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతన్న పనులను నాణ్యవంతంగా చేపట్టాలని సంగారెడ్డి, మెదక్ జిల్లాల పంచాయతీరాజ్ ఎస్ఈ టి.జగదీష్ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని రాయిపల్లి(సి) గ్రామ శివారులో పీఎంజీఎస్వై పథకంలో రూ. 1.85 కోట్ల నిధులతో నిర్మాణం చేపడుతున్న పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...రాయిపల్లి(సి),ఇటిక్యాపల్లి గ్రామ శివారులో చేపడుతున్న బ్రిడ్జీ పనులను వేగవంతగా చేయించాలని ఏఈ దేవయ్య అదేశాలు ఇచ్చారు. ఆయన వెంట ఈఈ అంజయ్య, డీఈ కుర్మయ్య ఉన్నారు.

అసెంబ్లీలో తీర్మానంపై బంజారాల సంబురాలు

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 28 : గోర్‌బోలి భాషను 8వ షెడ్యూల్‌లో చేర్చాలని తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసినందుకు బంజారాలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఐబీ వద్ద మిఠాయిలు పంచుకొని సంబురాలు చేసుకున్నారు. రాష్ట్ర జనాభాలో 40 లక్షలకు పైగా ఉన్నా లంబాడీల మాతృ భాషగా గోర్‌బోలి భాషను రాజ్యంగంలోని 8వ షెడ్యూలులో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేసినందుకు హర్షం వ్యక్తం చేశారు.

సినీ నిర్మాతపై చర్యలు తీసుకోవాలి : అనంతరం ఐబీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ జోగిపేట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె సంజీవయ్య, అతడి కుమారుడు క్రాంతి, సోదరులపై హత్యాయత్నం చేసిన సినీ నిర్మాత వెంకట మురళీకృష్ణపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల నాయకులు బీరయ్య యాదవ్, జగన్, దుర్గాప్రసాద్, మాజీ జడ్పీటీసీ రాజు రాథోడ్, సాయికుమార్, జైపాల్ నాయక్, పూల్ సింగ్, సురేశ్, భ్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

ఝరాసంగం, మార్చి 28 : హన్మన్న పటేల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తా (ఆటోస్టాండ్) వద్ద చలివేంద్రాన్ని హన్మన్న పటేల్ కుమారుడు బీఆర్ఎస్ నాయకుడు విజయ్‌పటేల్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిలో చలివేంద్రాలు ప్రజలకు దాహార్తిని తీర్చేందుకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ప్యారవరం మాజీ ఉప సర్పంచ్ మాణిక్ యాదవ్, సంగమేశ్వర్,